
అమరావతి: కృష్ణానదిలో హంసవాహనంపై స్వామివార్ల తెప్పోత్సవం


కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామికి జలాభిషేకం
పాలతో..
కుంకుమతో..
పసుపుతో..
విభూదితో..
చెక్కరతో..
ఫలాలతో
విశేష అలంకారం

దీపోత్సాహం


అమరావతి: ప్రత్యేక అలంకరణలో అమరేశ్వరుని మూలవిరాట్


అమరావతిలో నక్షత్రహారతి ఇస్తున్న అర్చకులు

- కోలాహలంగా కార్తీకపౌర్ణమి
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వైభవంగా కోటి దీపోత్సవం, జాల్వాతోరణం
- సూర్యలంక తీరంలో జలవందనం జనసంభరం
- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు
- అమరావతిలో పుణ్య హారతులతో పులకించిన కృష్ణమ్మ


కోటప్పకొండలో నంది విగ్రహం వద్ద దీపారాధనలు చేస్తున్న భక్తులు


మంగళగిరి: గండబేరుండ జ్వాలా దీపాన్ని వెలిగిస్తున్న మంత్రి నారా లోకేశ్


కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో జ్వాలాతోరణం

నరసరావుపేట, అమరావతి, బాపట్ల, పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రాలు, కృష్ణానది, సముద్ర తీర ప్రాంతాలు, గృహాలు దీపాల వెలుగులతో కాంతులీనాయి. హరహర మహాదేవ శంభోశంకర నామస్మరణతో ఆలయాలు, నదీ, సముద్ర తీర ప్రాంతాలు మారుమ్రోగాయి. కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతోనూ, ఉత్సాహంగా శుక్రవారం జరుపుకున్నారు. భక్తులతో జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. కృష్ణానదీ తీరంతో పాటు బాపట్ల జిల్లా పరిధిలోని సముద్ర తీరం భక్తులతో పోటెత్తింది. పుణ్యస్నానాలాచరించిన భక్తులు కార్తీక దీపారాధనలు చేసి గౌరమ్మకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద శివలింగాకరంలో కోటి దీపోత్సం నిర్వహించారు. కోటప్పకొండ, అమరావతి, పెదకాకాని ఆలయాల్లో స్వామివార్ల దర్శనాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణాల్లో కోటి దీపోత్సవం, జాల్వా తోరణం కార్యక్రమాలను భక్తులు తిలకించి పులకించిపోయారు.

- కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అభిషేకాల నిర్వహించి కోటయ్య స్వామికి విశేష అలంకారం చేశారు. వేలాది భక్తులతో గిరి ప్రదక్షణ కోలాహలంగా సాగింది. రాత్రి నేత్రపర్వంగా జ్వాలా తోరణం జరిగింది. ఈ సందర్భంగా స్వామికి అఖండ పూజ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.
- పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరారామం అమరావతికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున నుంచే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. బాణలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి, కృష్ణవేణికి చీర సారె సమర్పించారు. దూప, పంచ, నంది, కుంభ, నక్షత్ర, కర్పూర హారతులను నదీమాతకు సమర్పించగా స్నానఘాట్ల నుంచి వేలాది మంది భక్తులు కనులారా వీక్షించారు. విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించిన హంస వాహనంపై బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి తెప్పోత్సవం కృష్ణానది అలలపై కన్నుల పండువగా జరిగింది.
- ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక జనసంద్రంతో పులికించింది. పెద్దసంఖ్యలో భక్తులు తీరంలో దీపాలను వెలిగించి సముద్రుడికి, తారకేశ్వరస్వామి, శ్రీఆంజనేయస్వామిలకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు లక్ష మంది భక్తులు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తెలిపారు. తీరంలో సాగరహారతి అట్టహాసంగా జరిగింది. తీరం ఒడ్డున ఏర్పాటు చేసిన శివలింగానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ దంపతులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల సమక్షంలో సముద్రుడికి సాగర హారతులను ఇచ్చారు.
- పెదకాకాని మల్లేశ్వరస్వామి సన్నిధి కార్తీక దీపాల వెలుగులతో నిండిపోయింది. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. హైకోర్టు విశాంత్ర న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకునిని అభిషేక సేవలో పాల్గొన్నారు.


కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యలంక తీరానికి పోటెత్తిన భక్తులు


అమరావతి: కృష్ణమ్మ అలలపై కార్తీకదీపాలు వదులుతున్న భక్తులు


బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

వీరారాధన ఉత్సవాలకు శ్రీకారం

- పోతురాజు శిలకు పడిగం కట్టిన పీఠాధిపతి

కారంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కార్తీక పౌర్ణమి రోజైన శుక్రవారం రాత్రి శ్రీకారం చుట్టారు. వీరాచారవంతులు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవఅయ్యవారిని ఊరేగింపుగా వీరుల దేవాలయానికి తీసుకొచ్చారు. వీరుల దేవాలయంలో పోతురాజు శిలకు పీఠాధిపతి 101 పోగులతో పడిగం కట్టారు. బ్రహ్మనాయుడు ఆయుధమైన నృసింహకుంతానికి, కన్నమదాసు భైరవ ఖడ్గానికి, నాగమ్మ వీర ఖడ్గానికి, బాలచంద్రుడి త్రిశూలానికి పూజలు జరిపారు. ఆయుధాలతో ఉత్సవాలకు తరలిరావాలని పల్నాటి యుద్ధంలో అమరులైన వీరుల కుటుంబీకులకు, తమ పూర్వీకులకు శుక్రవారం రాత్రి లేఖలు పంపారు.


పోతురాజు శిలకు పడిగం కడుతున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

ఆటోనగర్.. ఇచట అన్నీ దొరుకును

- గుంటూరులో అతిపెద్ద ఆటోమొబైల్ స్పేర్ పార్ట్ మార్కెట్
- ఆటో మొదలు లారీల వరకూ.. ఏ విడిభాగాలైనా ఇక్కడే..
- వేల కోట్ల టర్నోవర్.. వేలాదిమందికి ఉపాధి కేంద్రంగా ఆటోనగర్
- లారీలు, ట్యాంకర్లను సైతం తుక్కు చేసే సామర్థ్యం మెకానిక్‌ల సొంతం

8



పత్తి కొనుగోలుకు సాకులు చెప్పొద్దు

- తేమశాతంతో పని లేకుండా రైతులకు న్యాయం చేయండి
- దళారుల చెంతకు వెళ్లేలా చేయొద్దు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- రైతుకు నష్టం జరిగితే ఊరుకోం : ఎమ్మెల్యే బూర్ల


సీసీఐ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

నరేంద్ర వర్గం.. నిర్వేదం

- చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
- విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
- రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు మొక్కుబడిగా హాజరు
- తమ నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి

6

షాపులు పడగొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా

- ఎంపీడీవోకి చిరుమామిళ్లలో వైసీపీ నేత బెదిరింపులు

6

ఏఎన్‌యూ ఎల్‌ఎల్‌బీ హానర్స్ డిగ్రీ ఫలితాలు విడుదల

భళా.. బాలోత్సవ్

- నేత్రానందంగా వీవీఐటీ కళాశాల ప్రాంగణం
- పోటా పోటీగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు
- అబ్బుర పరుస్తున్న నాటికలు

8



పులివెందుల ప్రజలకు జగన్ సమాధానం చెప్పాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి గైర్హాజరవుతున్న జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తనపై ప్రజలు మరోసారి ఆలోచన చేయాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా లేకపోతే సభకు రానని అనడం కరెక్టు కాదన్నారు. ఆయన అసెంబ్లీకి రాకపోవటం వలన మాకేమీ నష్టం లేదనీ, ఆయన నియోజకవర్గ ప్రజలకే నష్టం అని తెలిపారు. జగన్‌రెడ్డిని గెలిపించిన పులివెందుల ప్రజలకు ఆయన సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జగన్‌రెడ్డి అసెంబ్లీకి రాకపోగా, ఆయన పార్టీ ఎమ్మెల్యేలను కూడా అసెంబ్లీకి వెళ్లవద్దని చెప్పడం ఆయన పెత్తందారి మనస్తత్వానికి నిదర్శం అన్నారు. ఇప్పటికే అసెంబ్లీ సగం రోజులు గడిచి పోయాయని, మిగిలిన ఐదారు రోజులైనా సభకు రావాలని విజ్ఞప్తి చేశారు. మిగిలిన ఎమ్మెల్యేల హక్కులను జగన్‌రెడ్డి హరించ వద్దని హితవు చెప్పారు.

ఏఎన్‌యూ ఎల్‌ఎల్‌బీ హానర్స్ డిగ్రీ ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగంలో నిర్వహిస్తున్న మొదటి ఏడాది బీఏఎల్‌ఎల్‌బీ హానర్స్, బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను శుక్రవారం తాత్కాలిక వీసీ ఆచార్య కె.గంగాధర రావు, తాత్కాలిక రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి విడుదల చేశారు. బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్‌లో 25 మందికి 24 మంది, బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులో 25 మందికి 23 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద్‌రావు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఈ నెల 19 లోగా ఒక్కొక్క పేపర్‌కు రూ.1820 చెల్లించి దరఖాస్తులను పంపాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్, బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాధిపతి ఆచార్య ఎల్. జయశ్రీ, బీవోఎస్ ఛైర్మన్ ఆచార్య ఎన్.రంగయ్య, విభాగం అధ్యాపకులు ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ జి.సతీష్ కుమార్ బి.శ్రీరామ్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

న్యూగుంటూరు మీదగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే యాత్రికుల రద్దీ దృష్ట్యా న్యూగుంటూరు రైల్వేస్టేషన్ మీదగా శబరిమలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. నంబరు. 07145 మచిలీపట్నం - కొల్లాం స్పెషల్ ఈ నెల 18, 25 తేదీల్లో మధ్యాహ్నం 3.15కి బయలుదేరి సాయంత్రం 6 గంటలకు న్యూగుంటూరు, 6.48కి తెనాలి, రాత్రి 7.22కి బాపట్ల, 7.38కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 6.35కి కొట్టాయం, రాత్రి 7.27కి చెంగనూరు, 9 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. నంబరు. 07146 కొల్లాం - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 20, 27(బుధవారం) తేదీల్లో వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం వేకువజామునకు ముందు 1.18కి చీరాల, 1.28కి బాపట్ల, 2.08కి తెనాలి, 2.50కి న్యూగుంటూరు, ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

తెనాలి, బాపట్ల, చీరాల మీదగా మరికొన్ని రైళ్లు

ఈ నెల 22, 29 (శుక్రవారం) తేదీల్లో నంబరు. 07143 మౌలాలి - కొల్లాం రైలు ఉదయం 11.30కి బయలుదేరి కాజీపేట మార్గంలో ప్రయాణించి రాత్రి 7.48కి తెనాలి, 8.28కి బాపట్ల, 8.48కి చీరాల, మరుసటి రోజు సాయంత్రం 5.05కి కొట్టాయం, 5.46కి చెంగనూరు, రాత్రి 7 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. నంబరు. 07144 కొల్లాం - మౌలాలి రైలు ఈ నెల 24, డిసెంబరు 1 (ఆదివారం) ప్రారంభ సమయం (శనివారం అర్ధరాత్రి దాటాక) 2.30కి బయలుదేరి సోమవారం వేకువజామునకు ముందు 12.48కి చీరాల, 12.58కి బాపట్ల, 1.28కి తెనాలి, ఉదయం 10 గంటలకు మౌలాలి చేరుకొంటుంది.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు నడపాలి

జనవరి నెలలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రతిపాదించాలని జెడ్‌ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పులూరి శశిధర్ చౌదరి గుంటూరు డీఆర్‌ఎంకు లేఖ రాశారు. కుంభమేళా జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనుందన్నారు. గంగా పుష్కరాల సమయంలో గుంటూరు - బనారస్ ప్రత్యేక రైలుని మూడు ట్రిప్పులు నడపగా యాత్రికుల నుంచి విశేష ఆదరణ లభించింది. అలానే తాజాగా గుంటూరు మీదగా నడుపుతున్న సికింద్రాబాద్ - లక్నో గరీబ్‌రథ్ రైలుకు కూడా ప్రయాణికుల నుంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. దీని దృష్ట్యా కుంభమేళాకు సాధ్యమైనన్ని ఎక్కువ ట్రిప్పుల్లో ప్రత్యేక రైలుని ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు.

పత్తి కొనుగోలుకు సాకులు చెప్పొద్దు

● తేమశాతంతో పని లేకుండా రైతులకు న్యాయం చేయండి
● దళారుల చెంతకు వెళ్లేలా చేయొద్దు
● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
● రైతుకు నష్టం జరిగితే ఊరుకోం : ఎమ్మెల్యే బూర్ల



సీసీఐ కేంద్రంలోని పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర వచ్చినా ఎకరాకు రూ.20 వేల వరకు నష్టపోతారు. అటువంటి పరిస్థితిలో సీసీఐ కేంద్రానికి వచ్చిన పత్తి ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్లటానికి వీల్లేదు. అవసరమైతే తేమ శాతం కొద్దిగా ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయండి. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులు దిక్కుతోచని స్థితిలో దళారుల వద్దకు వెళ్లటానికి వీల్లేదు. పత్తి కొనకుండా ఉండటానికి సాకులు చెప్పొద్దు' అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం కుర్నూతలలోని గాయత్రి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పెమ్మసాని పత్తి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. తేమశాతం ఎక్కువగా ఉందని పత్తిని కొనుగోలు చేయటం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పత్తి కొనుగోలుకు వివిధ రకాల సాకులు చెబుతున్నారని తెలిపారు. రైతులు వాస్తవానికి పత్తిని ఆరబెట్టే సీసీఐకి తెస్తారని, అయితే ఈ ఏడాది వాతావరణం అంత అనుకూలంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి సాగు చేసిన రైతుల్లో చాలామంది కౌలుదారులు ఉన్నారని, వారికి పంటను నిల్వ చేసుకునేందుకు సరైన వసతి లేదని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయటం వల్ల సీసీఐకి జరిగే నష్టం ఏమిటని మంత్రి బయ్యర్‌ను ప్రశ్నించారు. తేమశాతం ఎక్కువగా ఉన్న పత్తిని కొనుగోలు చేయటం వల్ల జిన్నింగ్ వేసిన తర్వాత రంగు మారుతుందని, బరువులో కూడా తేడా వస్తుందని బయ్యర్, సీసీఐ అధికారులు మంత్రికి చెప్పారు. అనంతరం మంత్రి అప్పటికే అక్కడకు రైతులు తీసుకువచ్చిన పత్తిలో ఉన్న తేమ శాతాన్ని పరిశీలించారు. ఒకే లాట్‌లో నాలుగు సార్లు తేమశాతం చూడగా, మూడుసార్లు 12 శాతం, ఒకసారి 15 శాతం ఉన్నట్లు రావడంతో కేంద్ర మంత్రి సైతం ఆశ్చర్య పోయారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తి రైతులు కష్టాల్లో ఉన్న సంగతిని గుర్తెరిగి వారికి సీసీఐ న్యాయం చేయాలని అన్నారు. తేమ ఎక్కువగా ఉందని పత్తిని సీసీఐ కొనకపోతే రైతు దాన్ని మళ్లీ ఎక్కడకో తీసుకువెళ్లాలంటే రవాణా ఖర్చు తడిసి మోపెడు అవుతుందన్నారు. దళారులకు విక్రయించే పరిస్థితి రాకుండా చూడాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరుగుతూ ఉంటే తాను చూస్తూ కూర్చోనని స్పష్టం చేశారు. తేమతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులకు సూచించారు. తరుగు పేరుతో కోతలు విధించవద్దని అన్నారు. గుంటూరు జిల్లాలో 52 వేల హెక్టార్లలో, 8.40 లక్షల టన్నుల పత్తి పంట వచ్చే అవకాశం ఉన్నందున సీసీఐ రైతుల పక్షాన నిలబడి మేలు చేయాలని సూచించారు.

అన్ని సెంటర్లు తెరవాల్సిందే

పేరుకు రాష్ట్ర వ్యాప్తంగా 33 సెంటర్లు ఉన్నట్లు చెబుతోందని, తెరిచింది మాత్రం రెండు, మూడు సెంటర్లు మాత్రమేనని ఎమ్మెల్యే రామాంజనేయులు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని వద్ద ప్రస్తావించారు. వెంటనే సీసీఐ మేనేజర్ అమర్నాథ్ రెడ్డితో మంత్రి పెమ్మసాని ఫోన్‌లో మాట్లాడారు. ఎన్ని సెంటర్లు అయితే జిన్నింగ్‌కు టెండర్లు దక్కించుకున్నాయో వాటన్నింటినీ వెంటనే తెరవాలని సూచించారు. ఎవరికి ఎక్కడ ఇష్టం ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం కల్పించాలని సూచించారు.

కేంద్రం దృష్టికి మిర్చి ధర సమస్య

ఈ సందర్భంగా మిర్చి రైతులు కొందరు రోజు రోజుకు ధర పతనం అవుతుందని కేంద్ర సహాయ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఏడాది పంట తక్కువగా ఉన్న ధర పతనం అయిందని ఎమ్మెల్యే రామాంజనేయులు వివరించారు. ఈ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. అవసరం అయితే మార్కుఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేసేలా చూడాలని రైతులు కోరారు.

ఎరువుల వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలి

ఎరువుల షాపుల్లో బస్తాకు రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని కొందరు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దానిపై మంత్రి స్పందిస్తూ ఎరువుల వ్యాపారులు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జేసీ భార్గవ్ తేజ, మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, డీఏవో నున్న వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల చేతుల్లోకి విద్యుత్ రంగం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగరావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

గుంటూరు (తూర్పు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడా పెట్టుబడిదారులకు విద్యుత్ రంగాన్ని అప్పజెప్పటమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ), యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యూఈసీడబ్ల్యూయూ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో 'విద్యుత్ రంగం - ప్రభుత్వ విధానాలు - సవాళ్లు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. యూఈఈయూ, యూఈసీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు, జె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగం ఆస్తుల విలువ రూ. 82 లక్షల కోట్లనీ, దీనిని అంబానీ, అదానీ వంటి బడా పెట్టుబడిదారులకు అప్పగించటానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. చండీగఢ్, మహారాష్ట్ర పలు రాష్ట్రాల్లో పెట్టుబడిదారులకు అప్పగించటాన్ని ఉద్యోగులు అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపారని శ్వేత పత్రంలో పేర్కొన్న చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక భారాలు తగ్గించారా అని ప్రశ్నించారు. నాలుగు నెలల్లోనే రూ. 6 వేల కోట్లపైగా ట్రూఫ్ చార్జీలు పెంచారని, మరో రూ. 11వేల కోట్లు పెంచటానికి సిద్ధం అయ్యారన్నారు. గత ప్రభుత్వం హయాంలో షిరిడి సాయి కంపెనీతో జరిగిన ఒప్పందాల్లో అవినీతి జరిగిందని ఆరోపించారనీ, మరి అదే కంపెనీని ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాలు రెండూ ప్రజలపై భారాల విషయంలో ఒకటేనని అన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ రంగాన్ని పరిరక్షించుకోవటానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సదస్సులో నాయకులు ముజఫర్ అహ్మద్, కె.ఉమామహేశ్వరరావు, నాగబ్రహ్మచారి, వై.నేతాజి, ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

నరేంద్ర వర్గం.. నిర్వేదం

● చీఫ్‌విప్ పదవి ఆశించి ధూళిపాళ్ల భంగపాటు
● విప్ ప్రతిపాదనపై ఎమ్మెల్యే నరేంద్ర విముఖత
● రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు ముక్కుబడిగా హాజరు
● తమ నేతకు అన్యాయం జరిగిందని అనుయాయుల అసంతృప్తి




గుంటూరు, పొన్నూరుటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నుంచి ఆరు సార్లు విజయం సాధించి పార్టీ కోసం అహరహం శ్రమించే తమ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు కూటమి ప్రభుత్వంలో తగిన ప్రాధాన్యం దక్కలేదని నియోజకవర్గ టీడీపీ శ్రేణులు నిర్వేదంలో ఉన్నారు. నరేంద్రకు అన్యాయం జరిగిందంటూ రెండు రోజులుగా వివిధ సామాజిక వర్గాల నేతలు పత్రికా ప్రకటనలతో తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఈ పర్యాయం చంద్రబాబు కేబినెట్‌లో నరేంద్రకు చోటు దక్కుతుందని, ఆ తర్వాత కీలక పదవి వస్తుందని ఆశించి భంగపడ్డారు. 2014లో ఐదో సారి గెలుపొందినప్పుడే నరేంద్రకు మంత్రి పదవి ఖాయమని భావించారు. అప్పట్లో టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమకు ఇవ్వకపోయినా పర్వాలేదు.. నరేంద్రకు ఇవ్వడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. సంగం డెయిరీ ఛైర్మన్‌గా నరేంద్ర వ్యవహరిస్తున్నందున ఆయనకు ప్రత్యేకంగా మంత్రి ఇవ్వాల్సిన అవసరం లేదనే సాకు కూడా ప్రత్యర్థి వర్గం లేవనెత్తుతున్నది. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన నరేంద్ర ఐదేళ్లుగా పార్టీకి కొమ్ముకాస్తూ అధినేత చంద్రబాబుకు అండగా ఉంటూ వచ్చారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆయనపై నిత్యం విమర్శలు చేస్తూ ఒక దశలో జగన్ నా వెంట్రుక కూడా పీకలేడని విమర్శించి 32 రోజులు జైలు పాలయ్యారు. అయినా వెరవకుండా వైసీపీ ప్రభుత్వ తీరుపై పోరాటం ఆపలేదు. ఈ పర్యాయం ఆరో సారి నరేంద్ర విజయాన్ని సాధించగా తొలుత మంత్రి వర్గంలో చోటు లభిస్తుందని ఆయన అనుయాయులు భావించారు. అయితే కుల సమీకరణల్లో భాగంగా అవకాశం దక్కలేదు. ఆ తర్వాత చీఫ్‌విప్ పదవి దాదాపు ఖాయమని ప్రచారం జరిగింది. అయితే పల్నాడు జిల్లాకు ఒక్క మంత్రి పదవి కూడా లేకపోవడంతో ఆ ప్రాంతానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు ఆలోచన చేయడంతో నరేంద్ర పేరు వెనక్కు వెళ్ళిపోయింది. వినుకొండ నుంచి గెలుపొందిన జీవీ ఆంజనేయులును చీఫ్‌విప్ పదవి వరించింది. ఈ క్రమంలో నరేంద్రకు విప్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆయన సుముఖత వ్యక్తం చేయనట్లు తెలిసింది. కేబినెట్ హోదా స్థాయి పదవిని ఆశిస్తున్నట్లు నరేంద్ర అధిష్ఠానానికి తెలియజేసినట్లు సమాచారం. కాగా నరేంద్రకు చీఫ్‌విప్ పదవి రాలేదని తెలిసినప్పటి నుంచి పార్టీ శ్రేణులు అసంతృప్తి గళం వినిపిస్తున్నాయి. నరేంద్ర కూడా కొంత మనస్తాపానికి గురై రెండు రోజులుగా అసెంబ్లీ సమావేశాలకు ముక్కుబడిగా హాజరవుతున్నారు.

ప్రతిసారీ నిరాశే

పదవుల పందేరంలో నియోజకవర్గానికి సరైన ప్రాధాన్యం లభించడంలేదని టీడీపీ శ్రేణులు అసంతృప్తితో ఉన్నారు. నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా నిలిపిన ఘనత ధూళిపాళ్ల కుటుంబానిది. ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పొన్నూరు ఎమ్మెల్యేగా ఎన్నికై 1989 వరకు రెవెన్యూ వాఖ మంత్రిగా పనిచేశారు. 1994లో రోడ్డు ప్రమాదంలో వీరయ్యచౌదరి మృతి చెందగా ఆయన వారసుడిగా నరేంద్ర రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఆయన వరసుగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారు. 2019 ఎన్నికలో స్వల్ప తేడాతో ఓటమి పాలైనా తిరిగి 2024లో అఖండ విజయాన్ని సాధించారు. అయితే ప్రతిసారి నరేంద్ర పేరు మంత్రి పదవి రేసులో ఉండటం భంగపడటం నరేంద్రతో పాటు ఆయన అనుయాయులకు పరిపాటిగా మారింది. వీరయ్యచౌదరి తర్వాత 35 ఏళ్లుగా నియోజకవర్గానికి అమాత్య యోగం దక్కలేదు. నామినేటెడ్ పదవుల్లో సైతం పొన్నూరుకు సరైన ప్రాధాన్యం లేదని కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారు.

ఎరువు కాదది ఉప్పు

● ల్యాబ్ పరీక్షల్లో తేలింది ఇదే..
● ఆర్గానిక్ పేరిట రైతులకు టోకరా పెట్టాలనుకున్న కేటుగాళ్లు



ఆర్గానిక్ ఎరువులుగా చెబుతున్న ప్యాకెట్లను ల్యాబ్ పరీక్ష నిమిత్తం స్వాధీనం చేసుకుంటున్న అర్బన్ ఏవోలు (ఫైల్ ఫొటో)

గుంటూరు సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైతులను బురిడీ కొట్టించాలనుకున్న కేటుగాళ్ల గుట్టు రట్టుయింది. ఆర్గానిక్ ఎరువుల పేరిట చెలామణి చేస్తున్న వాటిలో ఉప్పు తప్ప మరేమీ లేదని తేలింది. సెప్టెంబరు 10వ తేదీన నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్‌ఎల్ పార్సిల్‌లో వ్యవసాయ అధికారులు రూ.13.68 లక్షల విలువ చేసే 6వేల కిలోల బరువు కలిగిన ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. 28.28.0, 00.52.34, 20.20.20, 13.0.45, 12.61.0, 13.40.13, 19.19.19, 13.0.45, 0.0.45 రకాల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారుల ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పార్సిల్ కార్యాలయంలో పెద్ద మొత్తంలో ఆర్గానిక్ ఎరువుల పేరిట చెలామణిలోకి వచ్చిన నకిలీలను స్వాధీనం చేసుకున్నారు. వాటిల్లో 6 నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ పరీక్షలో ఆరు నమూనాలు అవి అసలు ఎరువులే కాదని తేలింది. మార్కెట్‌లో అతి తక్కువ ధరకు లభ్యం అయ్యే ఉప్పు(సోడియం సల్ఫేటు)అని నిర్ధారించినట్లు తెలిసింది. వాటి వినియోగం వల్ల రైతులకు మేలు జరగక పోగా, భూమికి నష్టం వాటిల్లుతుంది. ప్రస్తుతం ల్యాబ్ పరీక్షలు ఆధారంగా తేలిన దాని ప్రకారం వాటిల్లో వాడిన ముడి పదార్థాల విలువ రూపాయిల్లో ఉంటుంది.

నేడు మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం

● హాజరుకానున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత

గుంటూరు (విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణను బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత నేడు గుంటూరులో లాంఛనంగా ప్రారంభించనున్నారు. స్థానిక రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగే సమావేశంలో మంత్రి సవిత పాల్గొంటారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మయూరి పాల్గొంటారు.

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్

గుంటూరు(విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సూర్యటెక్ సొల్యూషన్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.4 లక్షల ప్యాకేజీ కంపెనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను సజావుగా పరిశీలించాలి

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నిక కోసం జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని టీడీపీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీడీపీ నాయకుడు తిలక్ తదితరులు కలెక్టరేట్‌కు వచ్చి ఈఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలిని కలిసి చర్చించారు. ఎన్నికల సంఘం నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. కొంతమంది బీఎల్‌వోలు ఓటరు దరఖాస్తుల పరిశీలనకు వెళ్లినప్పుడు అటెస్టు చేసిన సర్టిఫికేట్ల కాపీలు అడుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలానే 10+2+3లో డిగ్రీ పాస్ అయ్యారా, లేదా అని కూడా ప్రశ్నిస్తున్నారని, కొందరైతే 10, ఇంటర్ సర్టిఫికేట్లు కూడా చూపమంటున్నారని చెప్పారు. దీనిపై ఈఆర్‌వో ఖాజావలి స్పందించి తాను బీఎల్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడానని చెప్పారు. ఈఆర్‌వో మాట్లాడుతూ దరఖాస్తుదారుడు నివేదించిన సర్టిఫికేట్లలో ఏమైనా అనుమానాలు ఉంటేనే ఒరిజినల్స్ చూపమని కోరాలని ఆదేశించామన్నారు. ఎవరైనా బీఎల్‌వో నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికేట్లు, అటెస్టెడ్ కాపీలు అడిగినట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. 3.30 లక్షల దరఖాస్తుల్లో 1.40 లక్షల పరిశీలన పూర్తి అయిందని, వాటిల్లో లక్ష ఆన్‌లైన్‌లో అప్‌లోడింగ్ చేశామన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తుల పరిశీలన ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించామన్నారు.

షాపులు పడ గొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా

● వైసీపీ నేత బెదిరింపులు



చిరుమామిళ్లలో అక్రమంగా నిర్మించిన షాపులను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'ఆ స్థలం నాది.. షాపులు పడగొడతారా.. ఒక్కొక్కరి సంగతి తేలుస్తా' అంటూ చిరుమామిళ్ల గ్రామానికి చెందిన వైసీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి బెదిరింపులకు దిగారు. మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో చెరువు పోరంబోకు అక్రమ రిజిస్ట్రేషన్, ఆ స్థలంలో నిర్మాణం చేసిన షాపింగ్ కాంప్లెక్స్‌పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో స్వరూపరాణి శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా స్థలాన్ని కొనుగోలు చేసి షాపులు నిర్మించిన మేకల రామిరెడ్డితోపాటు ఫిర్యాదుదారులు భవనం శ్రీనివాసరెడ్డి, ఘంటా హరికృష్ణలను పంచాయతీ కార్యాలయంలో విచారణకు పిలిచారు. శ్రీనివాసరెడ్డి, హరికృష్ణలను విచారణ చేస్తున్న సమయంలో కోటిరెడ్డి కార్యాలయానికి వచ్చారు. ఫిర్యాదుదారులతో పాటు తదితరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భవనం శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకొని కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో గ్రామానికి వచ్చారు. ఈలోగా కోటిరెడ్డి కార్యాలయం నుంచి బయటకు వెళ్లారు. అనంతరం ఎంపీడీవోకు అక్రమ నిర్మాణానికి సంబంధించిన ఫిర్యాదుదారులు అందజేశారు. విచారణలో సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వో, కార్యదర్శి ప్రేమరాజు, ఠాకూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనం చేసుకుని వస్తుండగా మృతి



సుబ్బారావు (ఫైల్)

రెంటచింతల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకుని వస్తుండగా జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతల గ్రామానికి చెందిన దండే సుబ్బారావు(38) కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని గురజాల మండలం దైద అమరలింగేశ్వర స్వామి దర్శనానికి బంధువులు, మిత్రులతో కలిసి ఆటోలో వెళ్లారు. అక్కడ కృష్ణానదిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం శుక్రవారం సాయంత్రం ఆటోలో రెంటచింతలకు బయలు దేరారు. కొద్ది నిమిషాలకే మూల మలుపు వద్ద ఆటో బోల్తా పడడంతో దండే సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య లక్ష్మీప్రసన్న, కుమారుడు ఉన్నాడు.

కొండ్రముట్ల సచివాలయంలో చోరీ

ఈపూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రముట్ల సచివాలయం,రైతు సేవా కేంద్రం, ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌లో చోరీ జరిగింది. శనివారం ఉదయంసచివాలయం ఉద్యోగులు కార్యాలయానికి వచ్చే సరికి గది తలుపు తాళం పగలకొట్టి ఉంది. అందులో ఉన్న కంప్యూటర్లు, యూపీఎస్‌లు, బ్యాటరీలు, ప్రింటర్లు, విలువైన కేబుల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు సెక్రటరీ ఏఎన్ రత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

40,639 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,928 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,639 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,602 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15600	334	10000	15000
నెంబరు. 5	8200	12500	నెంబరు. 5	12500	15000
273	10000	12000	273	--	--
341	8500	14000	341	9000	14500
4884	9000	12000	4884	11500	14500
సూపర్ 10	9000	10000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17000	తేజ	8000	17000
బ్యాడిగి	8000	15000	బ్యాడిగి	8500	14000
దేవనూరు డీలక్స్	9000	12500	దేవనూరు డీలక్స్	10000	13000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4800	10500

కొమ్మాలపాటిని కలిసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు



సత్తెనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం సత్తెనపల్లిలో కొద్దిసేపు ఆగారు. ఆయనను ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, న్యాయవాది మర్రి సుబ్బారెడ్డి, బాలనాగు శివ కోటేశ్వరరావు కలిశారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం వ్యాపారులు ఎవరూ అనధికార మద్యం విక్రయాలు చేయకూడదని, బెల్టు షాపులు నిర్వహించకూడదని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ.విజయకుమార్ అన్నారు. ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సర్కిల్ పరిధిలోని మద్యం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ కే నాగలక్ష్మి, మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన పోలీస్ వాహనం

● హోంగార్డుకు తీవ్ర, ఎస్‌ఐకి స్వల్ప గాయాలు

మాచర్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెట్రోలింగ్‌కు వెళ్లి వస్తున్న పోలీస్ బొలేరో వాహనం అదుపుతప్పిన ఘటనలో హోంగార్డు నాగెండ్ల బ్రహ్మంకు తీవ్ర గాయాలు కాగా, విజయపురిసౌత్ ఎస్‌ఐ మహ్మద్ షఫీకి స్వల్పగాయాలయ్యాయి. ఎస్‌ఐ, హోంగార్డు ఈ వాహనంలో పెట్రోలింగ్‌కు వెల్దుర్తి వెళ్లి తిరిగివస్తుండగా మండాది శివారులోకి రాగానే వారి వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న నర్సరీ గోడను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ హోంగార్డును వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలించారు. మాచర్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఎస్‌ఐ చికిత్స పొందుతున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : సీఐ

పెదకూరపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత ముందుకు పయనించాలని పెదకూరపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వీ.శ్రీనివాసులు అన్నారు. పెదకూరపాడులోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నెహ్రూ యువకేంద్రం అధికారి దేవిరెడ్డి కిరణ్మయి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీ అశోక్, జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, కో–ఆర్డినేటర్ వెలితోటి అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అచ్చమాంబ, పుల్లయ్యస్వామి కల్యాణం

సత్తెనపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపాడు గ్రామంలో ఉన్న మాతృశ్రీ అచ్చమాంబ, పుల్లయ్య స్వామి వార్షిక కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నదానాన్ని నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి 9 గంటలకు భక్త చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు.

హెచ్‌ఐవి బాధితులకు షుగర్, బీపీ పరీక్షలు

మాచర్లటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక లింక్ ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధితులకు శుక్రవారం షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభాను, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీ బాషా, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నకుమార్, కౌన్సిలర్ శ్రీనివాసరావు, స్టాఫ్ నర్సు రాణి, రీడ్స్ సీఎస్‌సీపీసీ గౌస్, రీడ్ టీఐ సిబ్బంది మౌలాలి, వైఆర్‌జీకేర్ సిబ్బంది దమయంతి, విహన్ సిబ్బంది పూర్ణిమ, లింక్ వర్కర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

●గురజాలటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌టీ సెంటర్‌లో షుగర్, బీపీ పరీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో గురజాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ వేల్పుల సుధీర్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జానీబాషా, డాక్టర్ ఏడుకొండలు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ రత్నకుమార్, హెడ్ నర్సు జయ, కౌన్సిలర్ వెంకయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, రీడ్స్ సీఎస్‌సీపీసీ గౌస్ పాల్గొన్నారు.

రేణుకా అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

మాచవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీ రేణుకా తల్లి అమ్మవారికి వెండి కిరీటాన్ని బహూకరించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి నరసింహారావు రూ.1.10 లక్షలతో చేయించిన వెండి కిరీటాన్ని దేవాలయంలోని రేణుకా అమ్మవారి విగ్రహానికి అలంకరించారు. గ్రామ పురోహితులు జానపాటి సీతారామశర్మ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నరసింహారావు కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కిరీటం బహూకరించినందుకు గ్రామస్తులు నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదు

అచ్చంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు అచ్చంపేట ఎస్‌ఐ వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కించ పరిచేలా అవమాన కరరీతిలో పోసాని కృష్ణమురళి మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని టీడీపీ నాయకులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ నేతలు నందిగం ఆశీర్వాదం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బత్తుల శ్రీనివాసరావు, బీసీ నాయకులు తిరువాయిపాటి ఆంజనేయులు, షేక్ మాబువలి, సందెపోగు సామేలు, చంటి, అన్నవరపు శివ శంకర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

సత్తెనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి అన్నపూర్ణ సమేత శివాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం వెనుక ఉన్న శివాలయంలో, పలు ఆలయాల్లో కూడా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● అమరావతి, నవంబరు 15: కార్తీక మాస పర్వదినాలలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించు కుని పంచారామ పుణ్యక్షేత్రాలలో ప్రథమ ఆరామమైన అమరారామంను భక్తులు సందర్శించారు. తెల్లవారుజామున నుంచి భక్తులు కృష్ణానదిలో పుణ్య స్నాన మాచరించి నదీతీరం, ఆలయ ప్రాంగణాలలో కార్తీక దీపాలను వెలిగించారు. కొందరు మహిళలు దీపాలను అరటి బోదెలో ఉంచి నదిలో వదలడం జరిగింది. మూలవిరాట్‌కు ప్రత్యామ్నాయంగా బాణలింగానికి భక్తుల పేరుమీద పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయాన్ని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జి వాణీమోహన్, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్, జనసేన అధికార ప్రతినిధి రజనీ, పలువురు అధికారులు, న్యాయమూర్తులు సందర్శించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో సీఐ ఎం.శ్రీనివాసరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అమరేశ్వరుని దర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

● పిడుగురాళ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులతో శివాలయాలన్నీ కిటకిటలాడాయి. పిడుగురాళ్ల శివాలయం, భోళాలింగేశ్వరస్వామి దేవాలయం, నాగులగుడి తదితర ప్రధాన శివాలయాలు, కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం, కనకదుర్గ, వాసవి అమ్మవారి దేవాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవం చేశారు. పట్టణంలోని పాతూరు శివాలయంలో జరిగిన కార్తీక పౌర్ణమి దీపోత్సవంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్, కూటమినేతలు పాల్గొన్నారు.

● దాచేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివాలయాలు, విష్ణుఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భట్రుపాలెం కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని భక్తులు అతి వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి ముఖ్య అతిథులుగా యరపతినేని నిఖిల్ హాజరై స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దాచేపల్లిలోని శ్రీ నాగేంద్ర సహిత గంగాభవాని సమేత ముక్తేశ్వరస్వామి ఆలయంలో భక్తులు వేలాదిగా తరలివచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. అదేవిధంగా నారాయణపురంలోని గంగా భవాని సమేత శివాలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడపల్లి, మట్టపల్లి, కోటప్పకొండ దేవాలయాలకు వెళ్లే భక్తులకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. రామాపురం గ్రామంలో యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అమరావతి ఆలయ ప్రాంగణములో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

● మాచవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మాచ వరం, మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయం, వేమవరం, చెన్నాయపాలెం, మల్లవోలు, పిల్లుట్ల తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయానికి పిడుగురాళ్ళ మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● క్రోసూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం మండలంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. క్రోసూరులోని శివాలయం ఆవరణ మొత్తం దీపాలతో నిండిపోయింది. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మండలంలోని పీసపాడులో మహిళలు పెద్ద సంఖ్యలో శివాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. 88 తాళ్ళూరులోని విశ్వేశ్వరస్వామి దేవాలయం, దొడ్లేరులోని భీమలింగేశ్వరస్వామి దర్శించుకున్నారు.

● కారంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఒప్పిచర్ల దొనకొండల్లో వెలిసిన ధనమల్లయ్యకు ప్రధాన అర్చకులు విశ్వనాథశాస్త్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కారంపూడిలోని సూరేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, వీరుల దేవాలయాల్లోను, చింతపల్లిలోని దొడ్డమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

● వెల్దుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు జరిపారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకొని కార్తీక దీపాలు వెలిగించారు. ఉప్పలపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి, గొట్టిపాళ్లలోని మార్కండేయస్వామి, యర్రబాలెం బాలనాగేంద్రస్వామి, గుండ్లపాడులోని శివాలయంలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

● దుర్గి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిపారు. దుర్గిలోని నగరేశ్వర, నాగేశ్వర, ఓంకారేశ్వర దేవాలయంలో ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామవీధుల్లో ఊరేగించారు.



ధనమల్లయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

● రెంటచింతల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించా రు. సుబ్బన్న తోట వెంకటేశ్వరస్వామి,శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ, శివాలయం, సత్రశాల ఆలయాల్లో హోమాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు జ్వాలా తోరణం నిర్వహించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన డిప్యూటీ కలెక్టర్ హరికృష్ణ దంపతులు సత్రశాలను సందర్శించారు.

● గురజాల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు శైవాలయాలకు పోటెత్తారు. మండలంలోని దైద బిలంలోని గంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులు కృష్ణా నదిలో స్నానమాచరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

● రాజుపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలిజేపల్లి, అకులగణపవరం, ఉప్పలపాడు, ఇనిమెట్ల, నెమలిపురి, కోటనెమలిపురి, గంగిరెడ్డిపాలెం తదితర గ్రామాలలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉదయం, సాయంత్రం శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ఆవరణలో అయ్యప్ప, శివస్వాములు, భవానీలు, ఆంజనేయస్వామి మాల ధరణ చేసిన స్వాములందరూ జ్వాలధరణ చేశారు. గంగిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ అనుల జగన్, ఆలయ చైర్మన్ పణిదరపు వీరాంజనేయులు ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు.

● బెల్లంకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బెల్లంకొండ ఊరి చివర ఉన్న శివాలయంలో శుక్రవారం మహిళలు భారీగా తరలివెళ్ళి ఆలయంలో దీపారాధనలు నిర్వహించారు. బెల్లంకొండ శివాలయంలో రాత్రి వేళ జ్వాలాతోరణం నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ పులుపుల వెంకట ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

● పెదకూరపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. 75 తాళ్ళూరులోని కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో పంచామృతాభిషేకాలు, సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.



శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న యరపతినేని నిఖిల్



పిడుగురాళ్ల శివాలయంలో కార్తీక మాస పూజల్లో పాల్గొన్న మహిళలు

జలప్రసాదం ఆర్వో ప్లాంట్‌లు ప్రారంభం



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు

అమరావతి, నవంబరు 15 : భక్తుల సౌకర్యార్థం దీవీస్ లేబరేటరీస్ లిమిటెడ్ జల ప్రసాదం పేరుతో రూ.32 లక్షల విలువైన రెండు ఆర్వో ప్లాంట్‌లను బహూకరించగా వాటిని స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్, సహాయ కమిషనర్, ఈవో పి.సునీల్‌కుమార్, దివీస్ ప్రతినిధి కిషోర్‌తో పాటు అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం రెండు తెలుగు రాష్ట్రాలలో 112 ప్లాంట్‌లను 25 క్షేత్రాలలో రూ.18 కోట్లతో ఏర్పాటు చేసినట్లు కిషోర్ తెలిపారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి : కలెక్టర్

మాచర్ల రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెం గిరిజన సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం నిర్వహించిన జన్ జాతీయ గౌరవ దినోత్సవం, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. వసతి గృహం వద్ద 11 విభాగాల ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాల్స్‌ను ఆయన ఆసక్తిగా తిలకించారు. బీహార్‌లో ప్రధాని నరేంద్రమోదీ రూ. 6,900 కోట్ల విలువైన పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాలికలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీశైలం ఐటీడీఏ జిల్లా అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ బూడిద గంగమ్మ, జడ్పీటీసీ మల్లుస్వామి, డీఈవో చంద్రకళ, ఆర్‌డీఏ పీడీ బాలునాయక్, డీఎల్‌డీఏ గబ్రూనాయక్, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఎర్రబాలెం మేజరుకు గండి

● 70 ఎకరాల వరి పంట నీటిలో మునక



కాలువకు గండి పడిన చిత్రం

బెల్లంకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎర్రబాలెం మేజరుకు గండిపడటంతో సుమారు 70 ఎకరాల వరి పంట నీటిలో మునిగింది. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ఎర్రబాలెం మేజరు పొర్లిపోవటంతో గండి పడింది. గత ఐదు సంవత్సరాలుగా కాలువలో పూడికతీయకపోవటంతో నాచు భారీగా పెరిగి కాలువ తెగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కెనాల్స్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇంత భారీగా నష్టం వాటిల్లిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నీట మునిగిన పంట పొలాల రైతులకు నష్టపరిహారం అందించాలని, కెనాల్స్ అధికారుల నిర్లక్ష్యం వలనే జరిగిందని, విచారించి తగు చర్యలు తీసుకోవాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి : ఎస్పీ

మాచర్లటౌన్, దుర్గి, గురజాల టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం మాచర్ల నియోజకవర్గ పరిధిలోని మాచర్లటౌన్, మాచర్ల రూరల్, వెల్దుర్తి, దుర్గి, గురజాల పోలీస్‌స్టేషన్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, నిల్వలపై దృష్టి సారించాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఉంచాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో కంప్లయింట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎస్పీ శ్రీనివాసరావు వెంట ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు ఉన్నారు.

పట్టణ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

సత్తెనపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు గురువారం రాత్రి పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళ్లల్లో గస్తీ పెంచాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సహకారమందిస్తా: యరపతినేని



అయ్యప్ప ఆలయ నమూనాను ఎమ్మెల్యే యరపతినేనికి అందజేస్తున్న టీడీపీ నేతలు, స్వాములు

రెంటచింతల,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోలిలో నిర్మించనున్న హరి హర సుతుడు అయ్యప్ప ఆలయ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆలయ నిర్మాణం నిమిత్తం ఈ నెల 17న జరగనున్న భూమి పూజ కార్యక్రమానికి రావాల్సిందిగా శుక్రవారం గోలికి చెందిన టీడీపీ నేతలు యరపతినేనిని ఆహ్వానించారు. రూ.35 కోట్లతో 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో త్రిపుర గోవర్ధనరావు, త్రిపుర కృష్ణారావు, కోరే నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, మణికంఠ, పరాల సుబ్బారావు స్వామి, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బోడపాటి రామకృష్ణప్రభురాజ్,ఓరుగంటి ఇన్నారెడ్డి ఉన్నారు.

మాదిగల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

క్రోసూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే మాదిగల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ క్రోసూరు మండల శాఖ అధ్యక్షులు జడ సుబ్బు మాదిగ అన్నారు. మండలంలోని పెరికపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగ కార్పోరేషన్ చైర్మన్‌గా తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని నియమించటం హర్షణీయమన్నారు. ఎస్సీ వర్గీకరణ తరువాతనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించటం తమ వర్గానికి చెందిన నిరుద్యోగులకు ఊరటనిచ్చే అంశం అన్నారు. ఆయనతో పాటు సిద్దెల దిలీప్, మురికపూడి ఇజ్రాయేలు, మందా రాజు, అచ్చయ్య, వెంకట రత్నం పాల్గొన్నారు.

ఆటోనగర్

ఇచ్చట అన్నీ దొరుకును..!



ఆటో పాడైపోయిందా.. విడి భాగాలు కావాలా? అయితే ఆటోనగర్ వెళ్లాల్సిందే! కారు.. జీపు.. లారీ.. కంటెయినర్.. ఇలా ఏది కావాలన్నా కేరాఫ్ అడ్రస్ గుంటూరు ఆటోనగర్! మారుతీ కారు మొదలు.. అతి ఖరీదైన ఇన్నోవా, స్కార్పియో, మహీంద్ర అది ఏ కారైనా.. ఏ బ్రాండైనా.. దానికి సంబంధించిన స్పేర్ పార్టులు కావాలా? అయితే ఆటోనగర్‌కు వెళ్లాల్సిందే! - అంతలా గుంటూరు ఆటోనగర్ తన ఖ్యాతిని, బ్రాండ్ ఇమేజీని పెంచుకుంది. గుంటూరు ఆటోనగర్లో స్పేర్ పార్టులు దొరకలేదా? ఇక రాష్ట్రంలో మరెక్కడా అవి దొరకకపోవచ్చు! అన్నంతగా విస్తరించింది. ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో గుంటూరు ఆటోనగర్ దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి, గుంటూరుజిల్లాకే తలమానికంగా నిలిచింది. ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్లను ఒడిసి పట్టుకుంటూ, నవ్యత్వాన్ని సొంతం చేసుకుంటూ తన బ్రాండ్ ఇమేజిని అంతకంతకూ విస్తరించుకుంటూ ముందుకు సాగుతోంది గుంటూరు ఆటోనగర్. తాజా పరిస్థితుల నేపథ్యంలో కేవలం ఆటో మొబైల్ సేవలకే పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో దూసుకు పోతోంది. వేల కోట్ల టర్నోవర్‌తో జిల్లాలోని వేలాది మందికి ఆటోమొబైల్ టెక్నీషియన్లు, మెకానిక్‌లకు జీవనోపాధిని అందిస్తోంది.

- అతిపెద్ద ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ మార్కెట్
- ఆటో మొదలు లారీల వరకూ.. ఏ విడిభాగాలైనా ఇక్కడే..
- లారీలు, ట్యాంకర్లను సైతం తుక్కు చేసే సామర్థ్యం
- వేల కోట్ల టర్నోవర్.. వేలాదిమందికి ఉపాధిగా ఆటోనగర్





గుంటూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటోనగర్ గురించి చెప్పాలంటే ముందుగా గుంటూరు మాయా బజార్ గురించి చెప్పాలి. ఎప్పుడో వంద ఏళ్ల క్రితం ఒక పదిమంది మోటార్ మెకానిక్కుల సమష్టి ఆలోచనతో పురుడుపోసుకున్న గుంటూరు మాయాబజార్ కాల క్రమంలో విస్తరించి పెద్దదయింది. పాత బస్టాండు సెంటర్లో నగరానికి నడిబొడ్డున వుండడంతో విస్తరించే వీలు లేకపోవడంతో అది నగర శివారుల్లో మరో విభాగంలో కార్యకలాపాలు మొదలు పెట్టింది. 1975లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మాయాబజార్‌కు ప్రత్యామ్నాయంగా 'ది ఇందిరా కో ఆపరేటివ్ ఆటోనగర్ లిమిటెడ్'ను ఏర్పాటుచేశారు. మాయాబజార్లోని వ్యాపారులు, మెకానిక్కులు, కార్మికులకు ఆటోనగర్లో ఉపాధిని కల్పించింది. దీంతో మాయాబజార్ ద్విచక్ర వాహనాలకు పరిమితమవగా ఆటోలు, కార్లు, లారీలకు సంబంధించిన కార్ఖానాలన్నీ ఆటోనగర్‌కు తరలి వెళ్లాయి. సువిశాల ప్రాంతం కావడంతో అక్కడ ఆటోనగర్ విస్తరణకు అవకాశాలు మెండుగా లభించాయి. అంతే అద్భుతమైన ఆటోమొబైల్ ప్రపంచం అక్కడ ఆవిష్కృతమయింది.



విడిభాగాల కాణాచి..

ఆటో మొదలు.. ఆడి కారు వరకూ, సాధారణ లారీ మొదలు భారీ కంటెయినర్ వరకూ ఏ వాహనానికి సంబంధించిన స్పేర్ పార్టులు కావాలన్నా ఆటోనగర్లో లభిస్తున్నాయి. తొలి రోజుల్లో చిన్న, చిన్న స్థానిక వాహనాలకు సంబంధించిన విడిభాగాలకే పరిమితమైన ఆటోనగర్ అనతికాలంలోనే భారీగా విస్తరించింది. ఇక్కడున్న కార్ఖానాల యజమానులు తమ వ్యాపారాన్ని ఇతర రాష్ట్రాలకు విస్తరించారు. గుజరాత్, ఢిల్లీ, ఒడిషా, తమిళనాడు ప్రాంతాలకు వెళ్లి అక్కడ పాత వాహనాలను కొని వాటిని స్క్రాప్‌గా మార్చే ప్రక్రియను ప్రారంభించారు. దీంతో అన్ని బ్రాండ్ల వాహనాల స్పేర్ పార్టులు గుంటూరులో అందుబాటులోకి వచ్చాయి. ఆటోనగర్లో ప్రస్తుతం 100కు పైగా కార్లను తుక్కుగా మార్చే కార్ఖానాలు ఉన్నాయి. అక్కడ మారుతి 100 మొదలు తాజాగా అందుబాటులోకి వచ్చిన వాహనాల విడిభాగాలు అన్నీ అందుబాటులో వుంటున్నాయి. స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, పార్చ్యూనర్, బొలేరో, ఇన్నోవా, మహీంద్ర, ఎక్స్‌యూవీ, స్కార్పియో, గ్జైలో సహా ఎన్నో రకాల కార్లకు సంబంధించిన సస్పెన్షన్స్, ఇంజన్, డోమ్‌లు, చక్రాలు, టైర్లు, హెడ్‌లైట్లు, సహా అన్నీ ఇక్కడ లభిస్తున్నాయి. ఆటోనగర్ విస్తరణను ఆఖరికి రైల్వే ట్రాక్ కూడా ఆపలేక పోయింది. ఆటోనగర్లో చోటు సరిపోక రైల్వే ట్రాక్ అవతలి ప్రాంతాన్ని కూడా డంపింగ్ కోసం వినియోగించుకుంటున్నారు. ఆటోనగర్లో 50కి పైగా లారీ కార్ఖానాలు వున్నాయి. లారీలకు సంబంధించిన అన్ని బ్రాండ్ల స్పేర్‌పార్టులు ఇక్కడ అందుబాటులో వున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. కాగా ఇక్కడ ప్రతి రోజూ పదుల సంఖ్యలో కాలం తీరిన లారీలు, ప్రమాదాలకు గురైన కార్లను తుక్కు కింద మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. దీంతోపాటు ఆటోలు, కార్లు, లారీలు, ట్యాంకర్లకు కావాల్సిన ఆకృతులను బట్టి వాటికి బాడీ బిల్డింగ్ కూడా చేస్తున్నారు. కరోనా అనంతరకాలంలో ఆయిల్ ధరలు పెరగడంతో లారీల యజమానులు మరమ్మతులు చేయించడం, కొత్త లారీలు కొనడం మానేశారు. దీంతో బాడీ బిల్డింగ్ పనులు తగ్గి వర్కర్లు దెబ్బతింటున్నారు.

ఆటోనగర్.. స్వరూపం..

1975లో గుంటూరు ఆటోనగర్ పురుడుపోసుకుంది. అప్పట్లో గుంటూరునగరానికి శివారున వున్న గుంటూరు- పెదకాకాని రోడ్డులో వున్న ఖాళీ స్థలాన్ని ఆటోనగర్‌కు కేటాయించారు. గుంటూరు ఆటో నగర్ 283 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో 2,416 ప్లాట్లు వున్నాయి. వాటిలో 1,923 ప్లాట్లలో కార్యకలాపాలు జరుగుతున్నాయి. తొలుత ఆటోమొబైల్ రంగానికే పరిమితమైన ఆటోనగర్ ఆ తరువాత తన పరిధిని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్‌తో పాటు ప్లాస్టిక్ పరిశ్రమల వైపు అడుగులు వేసింది. అంతటితో ఆగకుండా ఇతర రంగాలకు కూడా విస్తరించింది. కార్పెంటరీ రంగంతోపాటు, పరుపుల తయారి రంగానికి కూడా అవకాశం కల్పించింది. వాటితో పాటు ఆటోమొబైల్ షోరూమ్‌లు ఇటీవలి కాలంలో భారీగా ఏర్పాటు చేశారు. ఈ మొత్తం కలుపుకుంటే ప్రతి ఏటా 2వేల కోట్ల రూపాయలకు పైగా టర్నోవర్ జరుగుతున్నట్లు అంచనా! కాగా ఆటోనగర్లో 10వేల మందికి పైగా టెక్నీషియలన్లు, మెకానిక్కులు ఉపాధి పొందుతున్నారు. వారితోపాటు అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోనగర్ ఉపాధి కల్పిస్తోంది.



లారీ బాడీ బిల్డింగ్ చేస్తాం: షేక్ బాజీ : బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు

అన్ని రకాల లారీలకు బాడీ బిల్డింగ్ చేస్తాం. 2020కి ముందు వున్న లారీలకు బాడీ బిల్డింగ్ చేస్తాం. ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు, వెల్డరు, కార్పెంటర్, టింకర్, పెయింటర్లుగా పనిచేస్తున్నారు. కరోనా తరువాత పనులు కోల్పోయి చాలా మంది బయటకు వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆయిల్ రేట్లు పెరగడంతో కొత్త లారీలు కొనే పరిస్థితి లేదు. అందువల్ల ఇటీవల పనులు తగ్గుతున్నాయి.



అన్ని రకాల కార్ల భాగాలు లభిస్తాయి

ఖలీల్ ఖాన్, ఓల్డ్ మోటార్ పార్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఆటోనగర్లో అన్ని రకాల కార్లకు సంబంధించిన స్పేర్ పార్టులు దొరుకుతాయి. పాత తరం మారుతి కారు మొదలు ఇటీవల ఎక్కువగా వినియోగించే ఎన్నో రకాల కార్ల స్పేర్ పార్టులు ఇక్కడ లభిస్తున్నాయి. స్విఫ్ట్, స్విఫ్ట్ డిజైర్, పార్చ్యూనర్, బొలేరో, ఇన్నోవా, మహీంద్ర, ఎక్స్‌యూవీ, స్కార్పియో, గ్జైలో వంటివి పేరుకు కొన్ని మాత్రమే. ఇంకా ఎన్నో రకాల కార్ల విడిభాగాలు అందుబాటులో ఉంటాయి.



కార్మికుల కునుకు పాట్లు

ప్రపంచాన్ని అలవోకగా జయించిన అలెగ్జాండర్ సైతం చిన్న దోమ చేతిలో పడి ఘోరంగా దెబ్బ తిన్నాడు.అందుకే పాము కాటుకన్నా దోమ కాటు మిన్న అంటారు.మరి గుంటూరు బస్టాండ్ లో పగలు, రేయి అన్న తేడా లేకుండా దోమలు విజృంభిస్తూనే ఉంటాయి. వాటి భారి నుంచి తప్పించు కునేందుకు రాత్రి వేళ డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ లు ఇలా బస్సులపైనే దోమ తెరలు వేసుకొని నిద్రపోతున్నారు. ఊరంతా హాయిగా నిద్రపోతున్న ఆర్టీసీ కార్మికులకు కునికి పాటు కోసం ఎన్ని అవస్థలో. గురువారం అర్ధరాత్రి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కనిపించిన దృశ్యాలు.

- (ఆంధ్రజ్యోతి, గుంటూరు)

నిరుపయోగంగా జగనన్న ఇంటిస్థలాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అర్జీల రాసే కార్యక్రమంలో పాల్గొన్న కే రామకృష్ణ, ముప్పాళ్ల తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే సెంటు స్థలం పేదల నివాసానికి ఏ మాత్రం సరిపోదని సీపీఐ ఆనాడే వైసీపీ ప్రభుత్వానికి చెప్పినా ఖాతరు చేయకుండా మొండిగా ముందుకెళ్ళింది. దీంతో పేదల ఇంటి కల నెరవేరలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా స్థలం, ఇంటి నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అర్జీలు రాసే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వేల కోట్లు ఖర్చు పెట్టి 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా ఆ స్థలాలపై లబ్ధిదారులు సుముఖత చూపలేదన్నారు. పైగా ఇచ్చే రూ.1,80,000తో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ ముందుకు రాలేదన్నారు. దీంతో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు నిరుపయోగంగా మారిపోయాయని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఇస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ అర్జీలు రాసే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పెరిగిన ఖర్చులు నేపథ్యంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు పెంచాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లను మార్పు చేసి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలాలు ఇవ్వాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిని కలవనున్నట్లు చెప్పారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న సచివాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో 17న దక్షిణ భారత న్యాయవాదుల సదస్సు

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై ఒకటవ తేదీ నుంచి అమలులోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపి వేయాలని కోరుతూ నవంబరు 17న చెన్నై నగరం, తెనియంపేట్‌లోని కామరాజర్ హాలులో తమిళనాడు, దక్షిణ భారత న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, అడ్వకేట్స్ జేఏసీ నేతలు వై.కోటేశ్వరరావు, నల్లూరి మాధవరావులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా అధినియం' చట్టాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే విధంగా వున్నాయని వారు తెలిపారు. న్యాయవ్యవస్థలో పోలీసు యంత్రాంగానికి యధేచ్ఛగా అధికారా లను కల్పిస్తూ, న్యాయవ్యవస్థకు వున్న అధికారా లను కుదిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. ఈ చట్టాల అమలు ప్రజలకు నష్టదాయకం అని దేశవ్యాప్తం గా న్యాయవాదులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. ఉద్యమ కార్యాచరణను రూపొందించుటకు, వెంటనే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థిని విద్యార్థులతో ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ 2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వైభవంగా కొనసాగుతున్నాయి . పోటోపోటీగా చిన్నారుల ప్రదర్శన ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. తొలి రోజు శుక్రవారం 23 అంశాలలో 9 విభాగాలలో 30 వేదికలపై చిన్నారుల కనువిందైన ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలిరోజు పోటీలలో 330 పాఠశాలలు నుండి 4000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులు వారిని తోడ్కొని వచ్చిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో వీవీఐటీ బాలోత్సవ్ ప్రాంగణంలో సందడి నెలకొంది.

భళా..బాలోత్సవ్



- నేత్రానందంగా వీవీఐటీ కళాశాల ప్రాంగణం
- పోటా పోటీగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు
- అబ్బుర పరుస్తున్న నాటికలు.

పెదకాకాని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భళా ... బాలోత్సవం అన్నట్లుగా ఉంది వీవీఐటీ ప్రాంగణం. నంబూరు వీవీఐటీ కళాశాలలో తొలిరోజు శుక్రవారం బాలోత్సవ్ వేడుకలు అత్యంత నేత్రానందంగా ప్రారంభమయ్యాయి. చిన్నారుల పోటాపోటీ ప్రదర్శనలు సందర్శకులను అబ్బురపరుస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వేలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, సందర్శకులతో వీవీఐటీ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అద్భుత ప్రతిభా పాటవాలను విద్యార్థులు బాలోత్సవ్‌లో ప్రదర్శిస్తున్నారని, 60 కళలను ప్రోత్సహించే విధంగా బాలోత్సవ్ నిర్వహించడం మంచి పరిణామం అని అన్నారు. జీవితం అంటే కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే కాదని కష్టపడి మనకి ఉన్న ప్రతిభతో ముందుకు వెళ్లడం ద్వారా చిత్రగారిలా సింగర్, అబ్దుల్ కలాం, నారా చంద్రబాబులా నాయకులుగా ఎదగగలరని అన్నారు. మనలో ఉన్న ప్రతిభ మనకి తెలుస్తుం దని వాటిపై దృష్టి సారించండి అని బాలలకు హితవు పలికారు. తల్లిదండ్రులు విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు.

జానపదనృత్యం, ఏకపాత్రాభినయం, సాంప్రదాయ నృత్యం, సాంప్రదాయ వస్త్రధారణ వంటి విభాగాలు తొలిరోజు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా మిగిలాయి. అత్యధికంగా చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం విభాగంలో 1800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు వక్తృత్వం, తెలుగులోనే మాట్లాడదం, తెలుగు పద్యం, వంటి విభాగాలు విద్యార్థిని విద్యార్థులలో తెలుగుపై వున్న మక్కువను తెలియచేసాయి.

బాలోత్సవ్ ప్రాంగణం నంద గల్లా జయదేవ్ కుమారుడు గల్లా అశోక్ హీరోగా నటించిన దేవకీ నందన వాసుదేవ ఈనెల 22న విడుదల కానున్న నేపధ్యంలో హీరో, హీరోయిన్ మానస చిన్నారులతో సందడి చేసారు. నంది అవార్డ్ దక్కించుకున్న కపిరాజు నాటకాన్ని ప్రదర్శించారు.



విద్యార్థిని నృత్య ప్రదర్శన



చిన్నారికి భోజనం తినిపిస్తున్న తల్లి..







నంబూరు వీవీఐటీ కళాశాలలో జరుగుతున్న బాలోత్సవంలో చిన్నారుల ప్రదర్శనలు



చిన్నారికి భోజనం తినిపిస్తున్న తండ్రి

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

నరసరావుపేట లీగల్, నవంబరు 15: పోక్సో కేసులో పట్టణంలోని సాయినగర్ ఐదో లైనుకు చెందిన షేక్ సాయిబాను అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. నిందితుడు పట్టణంలోని మెడికల్ షాప్‌లో పనిచేస్తూ ప్రేమ పేరుతో ఓ బాలికను మోసగించినట్లు ఈ నెల 10వ తేదీన ఫిర్యాదు నమోదయింది. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి: కమిషనర్

వినుకొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ సర్వీసులకు సంబంధించి నూతన ఆధార్‌కార్డులు, ఎన్‌రోల్ చేయుటకు, బయోమెట్రిక్ అప్‌డేట్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ చేసేందుకు డౌన్‌లోడ్ తదితర సర్వీసులు చేసేందుకు ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజి, ధర్మపురి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలికలు), జడ్పీ పాఠశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని, వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

నూజెండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జోనల్ ఆటల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. 30 పాఠశాలలకు చెందిన విద్యార్థినులు కబడ్డీ ఆడగా 15 జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. అదేవిధంగా వాలీబాల్‌లో 18జట్లకు, ఖోఖోలో ఎనిమిది జట్లకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రిన్సిపాల్ ఎన్‌వీ రమణమ్మ, స్పోర్ట్స్ ఆర్గనైజర్ టీ జోత్న్న తదితరులు పాల్గొన్నారు.

సాతులూరు రైల్వేగేటు మూసివేత

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మరమ్మతుల నిమిత్తం సాతులూరు - నరసరావుపేట రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న ఎల్‌సీ నెంబరు. 290 గేటుని మూడు రోజులపాటు మూసి వేయనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. ఈ నెల 16వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటు మూసివేసి ఉంటుందన్నారు.

క్రైమ్ జోన్

అక్రమ మద్యం స్వాధీనం

వినుకొండ టౌన్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెంలో అక్రమ మద్యం అమ్ముతున్న కె.సుబ్బారావును అరెస్టుచేసి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కోర్టుకు హాజరుపర్చనున్నట్లు తెలియజేశారు. ఆయనతోపాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

కనమర్లపూడి (శావల్యాపురం)నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదువుతూ ఇటీవల అదృశ్యమైన శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామానికి చెందిన బాలుడు పూరేటి భరత్ ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ నెల 13న భరత్ అదృశ్యంపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినుకొండ పోలీసులు దర్యాప్తుచేసి బాలుడు కర్నూలులో ఉన్నట్లు గుర్తించి తీసుకువచ్చి శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు.

డబ్బుకోసం సైబర్ నేరగాళ్ళ యత్నాలు

శావల్యాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శావల్యాపురానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ మోసగాళ్ల మోసం చేసేందుకు శుక్రవారం యత్నించారు. పోలీసుల కథనం ప్రకారం శావల్యాపురానికి చెందిన కాకాని నారాయణరావు కుమారుడు, కుమార్తె విదేశాల్లో ఉన్నారు. సైబర్ నేరగాళ్ళు పోలీసుల్లా శుక్రవారం ఉదయం 10.30గంటల సమయంలో నారాయణకు వాట్సప్ ఫోన్ చేశారు. విదేశాల్లో మీ కుమార్తె మారకద్రవ్యాలతో తమవద్ద అదుపులో ఉందని, అరెస్టు చేస్తే 20ఏళ్ళ జైలుశిక్షను అనుభవించాల్సి వస్తుందని, తమకు 50వేలు ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా చెల్లిస్తే వెంటనే వదిలేస్తామని చెప్పారు. ఫోన్ కట్‌చేసి నారాయణ అమెరికాలో ఉన్న తన కుమార్తెకు ఫోన్ చేయగా ఇంట్లోనే సురక్షితంగా ఉన్నానని చెప్పటంతో సైబర్ నేరగాళ్ళకు ఫోన్ చేశాడు. దీంతో వారు హిందీలో పరుషపదజాలంతో దూషించి ఫోన్‌పెట్టేశాడు. దీనిపై నారాయణరావు ఎస్‌ఐ లోకేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు.

బంగారు, వెండి నగల చోరీ

శావల్యాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు, వెండి నగలు అపహరించిన సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం బొడ్రాయి బజారులో నివాసముంటున్న దురిశాల సత్యనారాయణ 15రోజుల క్రితం హైదరాబాద్‌లో నివాసముంటున్న తన కుమారుని వద్దకు వెళ్ళాడు. అప్పటినుండి పనిమనిషి ప్రతిరోజూ వచ్చి సత్యనారాయణ ఇంటి ఆవరణను శుభ్రం చేసి వెళ్ళేది. శుక్రవారం సాయంత్రం 4గంటల సమయంలో ఇంటి ఆవరణ శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషికి ఇంటి ముఖద్వారం తెరిచి ఉండడాన్ని గమనించి వెంటనే ఇరుగు పొరుగువారికి, యజమాని సత్యనారాయణకు ఫోన్‌లో విషయాన్ని తెలియజేసింది. విషయాన్ని సత్యనారాయణ తమ బంధువులకు చెప్పడంతో వారు వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బీరువాలోని రెండు బంగారు లాకెట్లు, చెవిదిద్దులు, కొన్ని వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శివాలయాల్లో వైభవంగా కార్తీక అభిషేకాలు



వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మంజునాథ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన జ్వాలా తోరణం

నరసరావుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాస వేడుకలు వైభంగా జరుగుతున్నాయి. పౌర్ణమి పురష్కరించుకొని శుక్రవారం శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో పెద్ద ఎత్తున కార్తీక దీపారాధనలు చేశారు. గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళీశ్వర స్వామికి, పల్నాడు రోడ్డు బాలయ్య నగర్‌లోని కళ్యాణ సుందరేశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయంలో అభిషేకాలు జరిగాయి. పల్నాడు రోడ్డులోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణ నడిబొడ్డులోని మహాశివుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. కోటప్పకొండలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు. చిలకలూరిపేట, నరసరావుపేట డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను కొండకు నిర్వహించింది. పోలీసుశాఖ భద్రతా చర్యలు చేపట్టింది. వివిధ సేవాసంస్థలు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశాయి.

వైభవంగా జ్వాలా తోరణం

కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి భీమలింగేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం, వివిధ శివాలయాల్లో జ్వాలా తోరణం ఘనంగా నిర్వహించారు. కల్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద శివలింగాకారంలో కోటి దీపోత్సం నిర్వహించారు. కోటప్పకొండలో ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఈవో డీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట అర్బన్: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



రవ్వవరంలో కార్తీక దీపోత్సవం

● రొంపిచర్ల: రొంపిచర్లలోని శంకరస్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, కొనకంచివారిపాలెంలోని వీరభద్రేశ్వర స్వామి, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లోని చంద్రమౌళీశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు మిగిలిన ఆలయాల్లో కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రొంపిచర్లలోని శంకరస్వామి ఆలయంలోని నందీశ్వరుడు, నాగేంద్ర స్వామి పుట్ట, ధ్వజ స్తంభం వద్ద భక్తులు దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● వినుకొండ: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రోజు పట్టణంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున రెండు గంటల నుంచి పౌర్ణమి గడియలు రావడంతో భక్తులు శివాలయాలకు చేరుకొని పంచామృతం, గంధం, పసుపు, కుంకుమ, భస్మం, పలు రకాల అభిషేకాలు చేశారు. పట్టణంలోని పాత శివాలయం, ఎన్‌ఎస్‌పీ కాలనీలోని లలితాంబిక సోమేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో వేకువ జామునే భక్తులు దేవాలయాలకు చేరుకొని 365 ఒత్తులు, ప్రమిదలలో వెలిగించారు.

● ఈపూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొచ్చెర్ల, ఈపూరు, ముప్పాళ్ళ, కొండ్రముట్ల, బొగ్గరం శివాలయాలలో ముక్కంటీశ్వరునికి భక్తులు అభిషేకాలు చేశారు. బొగ్గరంలో భారీ అన్నదానం చేశారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, వడ్డెంగుంట, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వెల్లటూరు మంజునాదేశ్వర, సోమేశ్వరస్వామి దేవాలయంలో స్వామివార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. శివాలయాలు భక్తలతో పోటెత్తాయి.

● శావల్యాపురం: కార్తీక పౌర్ణమి వేడుకలను మండలంలోని వేల్పూరు, గంటవారిపాలెం, పోట్లూరు, శావల్యాపురం, బొందిలిపాలెం, మతుకుమల్లి, కారుమంచి తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేల్పూరులోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏకాహం నిర్వహించారు. పోట్లూరు పంచాయతీ పరిధిలో గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న లక్ష్మీతిరుపతమ్మ, మావురాల ఎల్లమ్మతల్లి దేవాలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శావల్యాపురంలో నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో దీపారాధన మహోత్సవాన్ని నిర్వహించారు.

● నూజెండ్ల: మండలంలోని రవ్వవరం గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి, వీ అప్పాపురం కాశీ విశ్వేశ్వరాలయం, ములకలూరు, ఐనవోలు తదితర గ్రామాల్లో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవ్వవరంలో దేవాలయం వద్ద శివ లింగం ఆకారంలో కార్తీక దీపాలను వెలిగించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



చిలకలూరిపేటలో పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న విద్యార్థినులు

రొంపిచర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని అధికారులు సుబ్బారావు, వెంకటరావు తెలిపారు.

● యడ్లపాడు: జ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేది పుస్తకం అని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని యడ్లపాడు గ్రంథాలయ అధికారి సీహెచ్ అంజమ్మ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల రెండో రోజైన శుక్రవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ కార్యదర్శి బాషా, ఎం.ముత్తయ్య, మీరావలి, ఎం కోటేశ్వరరావు, డి రామారావు, పాఠకులు పాల్గొన్నారు.

● వినుకొండ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయ కేంద్రంలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి బద్రీనాయక్ శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

● ఈపూరు: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఈపూరు, ముప్పాళ్ళ గ్రంథాలయాలలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈపూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు గంటా శ్రీనివాసరావు, ఎస్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు డీఎస్ ప్రసాదు, ద్రాక్షావలి,కవిత, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లిలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా రెండోరోజు పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేశారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనకు నేనేం చేస్తానంటే అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు షేక్ లాలూ దాదా సాహెబ్ సేవా సమితి అధ్యక్షులు షేక్ సిద్ధాంతి కరిముల్లా కథల పుస్తకాలను బహుమతులుగా అందచేశారు. పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలి

● పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ సునీత



ఇర్లపాడులో సీసీరోడ్డును పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ జాయింట్ కమీషనర్ సునీత

శావల్యాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండగ కార్యక్రమం ద్వారా జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ సునీత అన్నారు. పల్లెపండగ కార్యక్రమం ద్వారా శావల్యాపురం మండలం ఇర్లపాడులో నిర్మించిన సీసీ రోడ్డును, ముండ్రువారిపాలెంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణపనులను ఆమె శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి, జిల్లా హార్టికల్చర్ అధికారి శిరీష, ఏపీడీ బూసిరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఏపీవో రామారావు, పంచాయతీరాజ్‌డీఈ గంగనాయక్, ఏఈ వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాల పరిశీలన

నాదెండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గోకులాల నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ సునీత సూచించారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో జరుగుతున్న గోకులం నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమెతో పాటు డ్వామా పీడీ లింగమూర్తి, ఏపీడీ పీరాలాల్ నాయక్, ఎంపీడీవో స్వరూపరాణి, కార్యదర్శి మధు, టీడీపీ నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరరావు, సురేష్ తదితరులు ఉన్నారు.

కమ్మజన వన సమారాధనకు ముమ్మర ఏర్పాట్లు

నరసరావుపేట రూరల్, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావిపాడు రోడ్డులోని కమ్మ బాలుర హాస్టల్ నందు ఈ నెల 17వ తేదీన ఆదివారం నాడు కమ్మజన కార్తీక వనసమారాధన నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేట పట్టణంలోని ప్రదాన సెంటర్ల నుండి ఉచిత బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని పట్టణంలోని బస్టాండు, రైల్వే స్టేషన్ ప్రాంతాల నుండి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి: ఎంపీడీవో

నూజెండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జీపీడీపీ వివరాలను సమర్థవంతంగా సేకరించాలన్నారు. స్థానిక వనరుల లభ్యత, ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించటంలో సమర్థవంతంగా పని చేయాలన్నారు.

వినుకొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా రామాంజనేయులు

శావల్యాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన బోయపాటి రామాంజనేయులును నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసిన రామాంజనేయులు అనంతరం ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి యువకుల ఉపాధికి శిక్షణనిచ్చారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా నేడు పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేనున్నట్లు డీ వన్ అసిస్టెంట్ ఇంజనీర్ రఫీ శుక్రవారం ఓ ప్రకటన లో తెలిపారు . ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను పెద్ద చెరువు, మహాలక్ష్మి నగర్, గోగుల సీతారామ నగర్, హోసన్నా మందిర్, శిశు మందిర్, వల్లప్ప చెరువు ప్రాంతాల్లో నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆ ప్రాంత విద్యుత్ వినియోగదారులు ఈ అంశాన్ని గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

ఈపూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఈపూరు సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు గురించి పర్సన్ ఇన్‌చార్జి నర్రా సురేంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో పోకా కోటేశ్వరరావు, బొల్లా సుబ్బారావు, బెల్లంకొండ సైదులు, ముద్దా నాగలక్ష్మయ్య, గోవిందు పాల్గొన్నారు.

చీఫ్‌విప్ జీవీకి ఘన సత్కారం

శావల్యాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ చీఫ్‌విప్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులును తాడేపల్లిలోని చీఫ్‌విప్ కార్యాలయంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, బొందిలిపాలెం మాజీ సర్పంచ్ ఒత్తుల వెంకటేశ్వర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎన్‌ఎస్‌పి కాల్వను బాగుచేయండి

వినుకొండ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఎన్‌ఎస్‌పీ కాల్వకు రెండువైపులా పిచ్చిమొక్కలతో నిండి ఉందని వీటిని తొలగించి శుభ్రపరచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు శుక్రవారం డిమాండ్ చేశారు. కోటప్పనగర్, పెదకంచర్ల, ఏనుగుపాలెం తదితర గ్రామాలకు నీరువెళ్తాయని శుభ్రపరచాలని అధికారులను కోరారు. ఈ కాలువలను ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు తదితరులు పరిశీలించారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై వేధింపులు

● టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు

అమరావతి, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): దళితులమైన తమను గత ప్రభుత్వంలో వేధింపులకు గురి చేశారని పలువురు బాధితులు వాపోయారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రజావినతులు స్వీకరించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన గంటిపోగు స్టీవెన్‌బాబు దళితుడనైన తనపై గతంలో వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తప్పుడు కేసు పెట్టి వేధించారని వాపోయారు. తప్పుడు కేసు అని తెలిసినా సీఐ చార్జ్‌షీట్ దాఖలు చేశారని, తనపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని కోరారు. వైసీపీ నేతల దౌర్జన్యాలను ఎదిరించి, పార్టీ కోసం పనిచేసి, జైలుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేస్తున్నారని పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

సీ సర్టిఫికెట్ విద్యార్థులకు సెమినార్

నరసరావుపేట రూరల్, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధమైన ప్రిపరేషన్‌తో ఆర్మీ పరీక్షలలో మంచి ఫలితాలుంటాయని ఆంధ్ర బెటాలియన్ ట్రైనింగ్ జేసీవో సుబేదార్ రేఖా రామ్ తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 2025న జరగనున్న సీ సర్టిఫికెట్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి

నరసరావుపేట టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని కట్టా రాములు వృద్ధాశ్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం టౌన్‌వైడ్ సూపర్ స్టార్ కృష్ణ-మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.

జేఎన్‌టీయూ కాకినాడ టెన్నిస్ జట్ల ఎంపిక



టెన్నిస్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ కాకినాడ మెన్, ఉమెన్ టెన్నిస్ జట్లు ఎంపిక శుక్రవారం జరిగింది. పరిశీలకులుగా యూనివర్శిటీ అబ్జర్వర్ డాక్టర్ జీపీ రాజు హాజరు అయ్యారు. విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ అభినందించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



సమస్య ఇది.. స్పందించరూ

మండలంలోని రొంపిచర్ల సుబ్బారెడ్డి కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం ఒరిగింది. పక్కన ఉన్న వైర్లపై స్తంభం వాలిపోయింది. వైర్లు తెగితే కాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు. - రొంపిచర్ల, ఆంధ్రజ్యోతి

ప్రారంభోత్సవాలతో జనవరిలో పల్లె పండుగ

● పంచాయతీరాజ్ ఏఈ షేక్ అల్లాభక్షు



బొల్లాపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో బొల్లాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూ.2.83కోట్ల అంచనాల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించనున్నట్టు బొల్లాపల్లి మండల పంచాయతీరాజ్‌శాఖ ఏఈ షేక్ అల్లాభక్షు తెలిపారు. వివిధ అంశాలపై ఆయన ఆంధ్రజ్యోతితో శుక్రవారం వెల్లడించిన వివరాలు.

ఫటా ఫట్

ప్రశ్న: బొల్లాపల్లి మండలంలో ఎన్ని కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారు?

జవాబు: సుమారు మూడున్నర కిలో మీటర్లలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు మూడున్నర కిలో మీటర్ల నిర్మాణం జరపనున్నాం.

ప్ర: పనులను ఎప్పటిలోగా పూర్తి చేయాలనుకుంటున్నారు?

జ: అన్ని పనులు డిసెంబరులోగా పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకొని శంకుస్థాపనలు చేశాం. జనవరిలో ప్రారంభోత్సవాల ద్వారా పండుగ నిర్వహిస్తాం.

ప్ర: చేసే పనులకు చెల్లింపులు చేసేందుకు నిదులు ఉన్నాయా?

జ: నిదులకు ఎలాంటి ఇబ్బంది లేదు. చేసిన పనులకు దశల వారీగా పూర్తి చేసిన పనినిబట్టి వారానికి ఒకసారి గురువారం బిల్లులు చెల్లిస్తున్నాం. నిర్మాణం పూర్తిచేసిన 25 రోజుల్లోనే బిల్లులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం.

విద్యార్థులకు స్టేషనరీ, స్కాలర్‌షిప్‌ల పంపిణీ

వినుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్లలో రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వారి ఆధ్వర్యంలో ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ పిల్లలకు స్పోర్ట్స్ మెటీరియల్, నోటుపుస్తకాలు, కుర్చీలు, బెంచీలు, స్కాలర్‌షిప్‌లను శుక్రవారం రోటరీక్లబ్ ప్రెసిడెంట్ గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో జఫ్రుల్లా, రోటరీ క్లబ్ సెక్రటరీ ఎ.నారాయణ, ట్రెజరర్‌లు ఎంఎస్ మస్తాన్, ఎం.హనుమంతరావు, మెంబర్లు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో పూజితకు గోల్డ్‌మెడల్



పూజిత

వినుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాయపాలెం లోని కుమ్మరిపాలెంకు చెందిన అంగటి పూజిత కుస్తీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తండ్రి బాబు శుక్రవారం తెలిపారు. నాగార్జున సాగర్‌లో 8వ తరగతి చదువుతున్న పూజిత 14వ తేదీన రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జూనియర్ బాలికల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తండ్రి బాబు తెలిపారు. శనివారం ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న నేషనల్ కుస్తీ పోటీల్లో పూజిత పాల్గొన్నట్లు బాబు తెలియజేశారు.